
# నీడకు ఎదురుతిరిగితే..?!



'ఆంధ్రప్రభ' వారపత్రిక . . . 14 జులై, 2001

"మే ఐ కమిన్ సర్?"

– అంటూ గది గుమ్మం దగ్గర నిలబడి అన్నాడు ప్రకాశరావు.

ప్రిన్సిపాల్ తలెత్తి ఒక్కసారి ఆయన వంక చూసి, "ఎస్... ప్లీజ్ కమిన్!" అన్నాడు. ఆయన రాగానే, "ప్లీజ్ బి సిటెడ్!" అంటూ కుర్చీ చూపించాడు.

"థాంక్యూ..." అంటూ కూర్చుని, "సార్! నా పేరు ప్రకాశరావు. మీ కాలేజీలో తెలుగు లెక్చరర్‌గా సెలక్షన్ వచ్చింది. ఈరోజు జాయిన్ అవడానికి వచ్చాను" అంటూ హ్యాండ్‌బ్యాగ్ లోంచి కవర్ తీసి ప్రిన్సిపాల్ ముందుంచాడు.

ఆ కవర్‌లోని పోస్టింగ్ ఆర్డర్స్ చూసి, "వెరీ నైస్! అయితే, ఈరోజే జాయిన్ అవుతారా?" అని అడిగాడు.

"అవునండీ..."

"అయితే రైటర్ దగ్గరకు వెళ్లి ఛార్జి రిపోర్టు, మిగిలిన కాగితాలు సంతకం చేసి ఇవ్వండి!"

"అలాగే సార్!" అంటూ లేచాడు ప్రకాశరావు.

"ఉండండి... మీరు జాయిన్ అయ్యే ముందు మీకు కొన్ని విషయాలు చెప్పాలి. అఁ... మీరు ఇంతకుముందు ఎక్కడైనా పనిచేశారా?"

"చేశాను. మా ఊరి హైస్కూల్లో రెండు సంవత్సరాలు చేశాను."

"ఏ ఊరు?"

"కృష్ణాజిల్లాలో ఒక గుడ్లవల్లేరు!"

"చూడండీ... పట్నంలో విద్యార్థులకీ, పల్లెల్లో విద్యార్థులకీ మనస్తత్వాలలో చాలా తేడా ఉంటుంది. పైగా, మీరు ఉద్యోగం చేయబోతోంది హైదరాబాద్ మహానగరంలో! ఇక్కడ అంతా మిక్స్‌డ్ కల్చర్! పేరుకి ఆంధ్ర రాజధాని అయినా తెలుగువారికి, తెలుగుకి ఉండవలసిన గౌరవం, గుర్తింపు లేవు. తెలుగు మాస్టార్లంటే మరీ చులకన! ఇదంతా నేను చెప్తోంది– మిమ్మల్ని భయపెట్టడానికో, బెదరగొట్టి పంపించి వేయడానికో కాదు. ఉన్న పరిస్థితి చెప్తే తగిన జాగ్రత్త ముందుగానే తీసుకుంటారని ఈ కాలేజీ హెడ్‌గా అడ్వయిజ్ చేస్తున్నాను."

"థాంక్యూ సర్!"

"టీచర్స్‌ని టీజ్ చేయడమనేది విద్యార్థుల హాబీ! అది కొన్ని హద్దుల్లో ఉంటే ఫర్వాలేదు. ఒక్కోసారి శాడిస్ట్ లెవెల్లో వికృతంగా బయటపడుతుంటుంది. వారు ఏడిపించడం

ఫలానా విధంగా ఉంటుందని అనుకోవడానికి లేదు. అది మారుపేర్లు పెట్టడం, పిల్లి కూతలు, కుక్క మొరుగులు వినిపించడం, బ్లాక్‌బోర్డు మీద బొమ్మలు, పేర్లు, వ్యాఖ్యలు రాయడం, తిక్కప్రశ్నలు, వెకిలి జోక్‌లు చేయడం... ఇలా ఏ రకంగానైనా ఉండవచ్చు. మనిషిని బట్టి, పరిస్థితులను బట్టి అది మారుతుంటుంది. అయితే ఒక్కటి... వీటిని తట్టుకుని ఆవేశపడకుండా, చాకచక్యంగా రిపోర్టు ఇస్తూ, వాళ్ళతో ఫ్రీగా మూవ్ అయిపోతే నెత్తిన పెట్టుకుంటారు, హీరోలా ఆరాధిస్తారు."

"అలాగే సార్... మీరు చెప్పినట్లు నడుచుకోవడానికి ప్రయత్నిస్తాను."

"ఆఁ... అన్నట్లు మీకు ఉర్దూ వచ్చా?"

"రాదండీ!"

"అయినా ఫర్వాలేదు లెండి! మా జూనియర్ కాలేజీలో ఇంచుమించు అందరూ తెలుగువాళ్ళే! పాత నగరంలోని కాలేజీ అయితే భాష కూడా మీకు చిక్కులు తెచ్చేది. సర్లెండి... ఆఫీసులో జాయినింగ్ రిపోర్టు, అవీ ఇచ్చేసి టైమ్ టేబుల్ తీసుకోండి. రైటర్‌ని అడగండి... మీ క్లాసులు ఎప్పుడున్నాయో చెప్తారు?"

"థాంక్యూ సర్... వెళ్ళి వస్తాను."

"విష్ యూ ఆల్ ది బెస్ట్! ఐ హోప్ యూ విల్ గెట్ డూ!"

●

ప్రకాశరావు వెళ్ళి డ్యూటీలో జాయినై రైటర్ దగ్గర టైమ్ టేబుల్ తీసుకున్నాడు.

క్లాసుకి ఇంక అరగంటే టైముంది!

ఈలోగా లెక్చర్ హాల్స్, అవీ చూసివద్దామని బయలుదేరాడు.

కారిడార్‌లో కొంచెందూరం వెళ్ళేసరికి తాను పాఠం చెప్పాల్సిన లెక్చర్ హాల్ కనిపించింది.

అప్రయత్నంగా ఆయన గుండె ఝల్లుమంది. బయటనుంచే ఓసారి హాలుని పరికించి, తిరిగి స్టాఫ్ రూమ్‌కి వెళ్ళి కూర్చున్నాడు.

అక్కడ వున్న లెక్చరర్లకి తనని పరిచయం చేసుకున్నాడు.

●

క్లాసు 11 :00 గంటలకి!

సరిగ్గా టైముకి హాల్‌లోకి ప్రవేశించాడు ప్రకాశరావు. గుండెచప్పుడు బయటకు వినబడడం లేదు గాని, చెమటలు కారిపోతున్నాయి. అసలే బట్టతలేమో... చెమట ధారగా

నుదుటి మీదికి కారుతూ బొట్లుబొట్లుగా క్రిందికి పడుతోంది. చెమట తుడుచుకుంటూ హాల్లోకి అడుగుపెట్టాడు.

తెల్లటి ప్యాంటు, షర్టు పైన నల్లని ముఖం, దానిపైన నున్నని బట్టతల, అక్కడక్కడ ఒకటీ, అరా వెంట్రుకలు కనిపిస్తున్నాయి. 'ఆ శాల్తీ ఎవరా...' అనుకుంటూ ఆయన వైపు చూస్తూ ఆయన టేబుల్ దగ్గరకు వెళ్లగానే 'కొత్త లెక్చరర్' అని అర్థంచేసుకుని అలవాటుగా లేచి నిలబడ్డారు.

టేబుల్ దగ్గర నిలబడి, "గుడ్‌మార్నింగ్ మైడియర్ స్టూడెంట్స్! నా పేరు ప్రకాశరావు. తెలుగు లెక్చరర్‌గా ఈరోజే జాయినయ్యాను!"

– అంటూ తనని పరిచయం చేసుకున్నాడు.

"వెరీ గుడ్‌మార్నింగ్ సర్!" అన్నారా స్టూడెంట్స్ ముక్తకంఠంతో.

ఆ కోరస్‌లో "ఏమిటీ... పేరు ప్రకాశమా? 'నల్ల బంగారం' అంటే బాగుండేది!" అన్న కామెంట్, ఆ వెంటనే సన్నపాటి నవ్వులు వెనక బెంచీల నుంచి వినిపించాయి.

ఆ మాటలు విననట్లు, "స్టూడెంట్స్! ఎవ్రివన్ ఆఫ్ యూ ప్లీజ్ గివ్ సెల్ఫ్ ఇంట్రడక్షన్!" అన్నాడు ప్రకాశరావు.

"ఇది తెలుగు క్లాస్ సర్... తెలుగులో మాట్లాడండి!" అని వెనకాల నుంచి మరెవరో అరిచారు.

"యూ ఆర్ కరెక్ట్!" అని వెంటనే నాలుక్కరుచుకుని, "ఆ మాట అన్నది ఎవరో కాని, సరిగ్గా చెప్పారు. ఆ విద్యార్థి లేచి నుంచుంటే బాగుంటుంది!" అన్నాడు ప్రకాశరావు.

వెనక బెంచీల దగ్గర ఒక కళ్ళజోడు అబ్బాయి నిలబడ్డాడు.

"థాంక్యూ... స్టూడెంట్స్! ఇలాగే మీ మనసులోని అభిప్రాయాలను జంకు లేకుండా తెల్పండి. క్లాసురూమ్‌లోనే మీరు స్టూడెంట్స్, నేను లెక్చరర్‌ని. బయట మనమంతా ఫ్రెండ్స్!" అన్నాడు ప్రకాశరావు.

"థాంక్యూ... స్టూడెంట్స్' అంటూ మళ్లీ ఇంగ్లీషులో మాట్లాడారు!" అన్నాడు మరో విద్యార్థి నిలబడి.

"నిజమే! ఇటువంటి కొన్ని మాటలు మన నిత్యజీవితంలో భాగమైపోయాయి. అవి తెలుగులో చేరిపోయిన మాటలుగా భావించి అలా అంటేనే బాగుంటుంది. ఇటువంటి కొన్ని మాటలకు ఎక్జెంప్షన్ ఇవ్వండి!" అన్నాడు.

ఆయన 'ఎక్జెంప్షన్' అనగానే అందరూ నవ్వారు.

తర్వాత విద్యార్థులు వారివారి గురించి పరిచయం చేసుకున్నారు.

కాలేజీ రీ- ఓపెనింగ్ రోజులేమో... క్లాసులు ఇంకా సరిగ్గా జరగడం లేదు. ఆ తర్వాత ఓ అరగంట ఆ మాటా, ఈ మాటలతో గడిపి ఓ పావుగంటసేపు పాఠం మొదలుపెట్టి ఎలానో అయిందనిపించాడు.

గంట మ్రోగి బయటపడగానే- జైల్లోంచి బయటకు వచ్చినట్లనిపించి హాయిగా ఊపిరి పీల్చుకున్నాడు ప్రకాశరావు.

'ఫర్వాలేదు. ఈ క్లాసులో పిల్లలు మంచివాళ్ళు లాగానే ఉన్నారు. విన్నంత, అనుకున్నంత చెడ్డవాళ్ళేం కాదు. ఈరోజు సరదాగానే గడిచిపోయింది!' అనుకున్నాడు ప్రకాశరావు.

కొన్నిరోజులు ఏ సమస్యా లేకుండా సజావుగానే గడిచిపోయింది.

అయితే... నెలరోజులు అవుతుండగా దున్నపోతుల్లాంటి నలుగురు కొత్తగా చేరారు. వాళ్ళని చూడగానే ఎక్కడా సీటు దొరక్క రికమెండేషన్‌తో ఈ కాలేజీలో చేరిన బాపతు అని అనిపిస్తూనే వుంది. వాళ్ళ పేర్లు అడిగినప్పుడు సమాధానం ఇచ్చిన తీరూ చూస్తూనే తెలుస్తోంది- వాళ్ళు బొత్తిగా మంచీ, మర్యాదా, సంస్కారం లేనివారనీ, వాళ్ళతో గొడవ పెట్టకోవడం ఎందుకని సర్దుకుపోయాడు ప్రకాశరావు.

వాళ్ళు వచ్చినప్పటినుంచీ ప్రతిరోజూ న్యూసెన్స్‌గానే తయారైంది...

ఒకడు సెల్‌ఫోన్ తెచ్చుకుని ఎంతసేపూ ఎవరితోనో మాట్లాడుతూ ఉంటాడు. ఒకడు హెడ్‌ఫోన్ పెట్టుకుని క్యాసెట్ వింటుంటాడు. మరోడు పుస్తకం మధ్యలో ఏదో (చెత్త)పుస్తకం పెట్టుకుని చదువుతూంటాడు. ఇంకోడు ఏదో వాగుతూ ఉంటాడు.

ఒకటి రెండురోజులు వాళ్ళ ప్రవర్తనను ఓపిగ్గా భరించాడు ప్రకాశరావు. ఊరుకుంటే తాను లోకువైపోతాడు. ఆ అలుసు చూసుకుని, మంచిగా వున్న మిగతా విద్యార్థులు కూడా తిక్కగా ప్రవర్తిస్తారు.

నాలుగోరోజున ఇంక తట్టుకోలేక ఆ నలుగురినీ పేరుపేరున పిలిచి నిలబడ మన్నాడు. ఇద్దరు నిలబడగా, మిగిలిన ఇద్దరిలో ఒకడు పట్టించుకోనట్లు కూర్చున్నాడు. ఇంకోడు వెకిలిగా నవ్వుతూ పక్కచూపులు చూస్తూ కూర్చున్నాడు. క్లాసంతా తలలు వాళ్ళవైపే తిప్పి చూస్తోంది.

"మైడియర్ స్టూడెంట్స్... మీరు ఇక్కడికి వచ్చింది చదువుకోవడానికి! మీరు సెల్‌ఫోన్‌లు, హెడ్‌ఫోన్‌లు తెచ్చుకుంటే మీరు పాఠాలు శ్రద్ధగా వినలేరు. మిగిలినవాళ్ళకి

కూడా డిస్టర్బెన్స్! వాటిని తీసుకురాకండి. క్లాసులో ఉన్నంతసేపూ శ్రద్ధగా పాఠాలు వినండి!” అన్నాడు ప్రకాశరావు.

“తెలుగు క్లాసు కూడా శ్రద్ధగా వినాలా?” అన్నాడు ఒక ముర్రెజాతి బఱ్ఱెలాంటి వాడు. అదేదో పెద్ద జోకయినట్లుగా మిగిలిన ముగ్గురు బిగ్గరగా నవ్వారు. పాత స్టూడెంట్స్ నవ్వలేదు కాని, చాలామంది ముఖాల్లో చిరునవ్వు చిందింది.

“మేము ఫీజు కట్టే కాలేజీలో చేరాం! మా ఇష్టమొచ్చినప్పుడు వస్తాం. బుద్ధి పుట్టినప్పుడు వెళ్లిపోతాం. కావాలనుకున్నంతసేపు క్లాసులో కూర్చుంటాం!” అన్నాడు జెర్సీ ఎద్దులాంటి వాడి స్నేహితుడు.

“మీరు క్లాసుకి వచ్చేది పాఠాలు నేర్చుకోవడం కోసం కాకపోతే మీరు క్లాసుకి రానక్కరలేదు. మీకు కావాల్సింది అటెండెన్స్ అయితే మీరు క్లాసుకి రాకపోయినా ఇస్తాను. అందుకే మీ ఎల్డర్ బ్రదర్‌గా రిక్వెస్ట్ చేస్తున్నాను. మీ చేష్టలతో మిగిలిన స్టూడెంట్స్‌కి ఇబ్బంది కలిగించకండి!” అన్నాడు ప్రకాశరావు అనునయంగా.

ముర్రె జాతివాడు ఏమనుకున్నాడో... మాట్లాడకుండా, చెప్పకుండా నోట్‌బుక్ తీసుకుని లెక్చరర్ ముందునుంచే బయటికి వెళ్లిపోయాడు. వాడి వెనకే జెర్సీ బ్రాండూ, మిగిలిన ఇద్దరూ అనుచర గణంలాగా, చూపుడు గొఱ్ఱె వెనకాల వెళ్లే గొఱ్ఱెల్లాగా వెళ్లిపోయారు.

కొద్ది నిమిషాల పాటు ప్రకాశరావు మౌనంగా ఉండిపోయాడు.

కానీ, ఆయన అంతరంగంలో పడుతున్న సంఘర్షణ ముఖంలో ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. క్లాసులో పిన్‌డ్రాప్ సైలెన్స్ అలముకుంది. విద్యార్థుల ముఖాల్లో ఆందోళన కనిపిస్తోంది.

ఒక ఐదు నిమిషాలయ్యాక మౌనాన్ని భగ్నం చేస్తూ-

“ఏం చేస్తాం! కాలం విలువ వాళ్ళకి తెలియదు. డబ్బు పోయినా తిరిగి సంపాదించగలం. పోయిన కాలాన్ని మాత్రం తిరిగి తెచ్చుకోలేం! క్లాసులు మానేసి వాళ్ళు ఏం పోగొట్టుకుంటున్నారో వాళ్ళకి తెలియదు. తెలిసేసరికి సమయం మించిపోతుంది. పశ్చాత్తాప పడీ ప్రయోజనం ఉండదు. కానీండి... మీరైనా శ్రద్ధగా చదువుకోండి. మీలో ఒక్కరైనా జాతి గర్వించదగ్గ ఔన్నత్యాన్ని సాధిస్తే నాకు అంతేచాలు!” అన్నాడు ప్రకాశరావు.

విద్యార్థులు ఏమీ మాట్లాడలేదు. పాఠం మళ్లీ మొదలుపెట్టాడే కాని- అర్థమనస్కంగానే చెప్పి ఆ పూటకి అయిందనిపించాడు.

మర్నాడు ప్రొద్దున క్లాసుకు రాగానే హాల్లో గంభీర వాతావరణం నెలకొని ఉంది.

కొందరి ముఖాల్లో వచ్చే నవ్వుని ఆపుకునే ప్రయత్నం కనిపిస్తోంది. 'దుష్ట చతుష్టయం' దొంగచూపులు చూస్తూ నవ్వుకుంటోంది.

టేబుల్ మీద టెక్స్ట్‌బుక్ పెట్టి బ్లాక్‌బోర్డ్ వైపు తిరిగేసరికి గుండె ఝల్లుమంది.

బోర్డుమీద ఉబ్బెత్తుగా పొట్ట, బట్టతల వున్న ఒక వ్యక్తి బొమ్మ! దాని కింద 'కె.పి.ఆర్. తారు డబ్బా' అన్న అక్షరాలు! తనకి 'తారు డబ్బా' అని నామకరణం చేసి, తన బొమ్మని వేశారని అర్థమవుతోంది.

ఒక్కసారి షాక్ తిన్నాడు ప్రకాశరావు.

వెంటనే తేరుకుని, "మన క్లాసులో ఆర్టిస్టులు కూడా ఉన్నందుకు సంతోషం! అయితే ఈ బొమ్మ అప్పుడే నేర్చుకుంటున్నవాడు వేసినట్లుగా ఉంది. క్లాసు పాఠాల మీద శ్రద్ధ లేకపోయినా కనీసం చిత్రకళనైనా శ్రద్ధగా నేర్చుకుంటే పైకి వస్తాడు!" అంటూ డస్టర్‌తో ఆ బొమ్మను తుడిచివేశాడు.

దుష్టచతుష్టయం ముఖాల్లో దెబ్బతిన్న అహం స్పష్టంగా కనిపిస్తోంది. ముఖాన్ని కందగడ్డలు చేసుకుని సైడ్‌డోర్ లోంచి బయటికి వెళ్లిపోయారు.

మెత్తని చెప్పుతో గట్టిదెబ్బ కొట్టినందుకు తమ లెక్చరర్ పట్ల విద్యార్థులకు కలిగిన గౌరవం వారి ముఖాల్లో కనిపిస్తోంది.

మర్నాడు క్లాసుకి వచ్చేసరికి రంగురంగుల చాక్‌పీస్‌తో వికృతంగా తన బొమ్మ గీసి, 'తారు డబ్బా- కె.పి.ఆర్.' అని కింద రాసి ఉండడం కనిపించింది.

"ఫర్వాలేదు. ఈ ఆర్టిస్ట్ ఒక్కరోజులోనే రంగుల చిత్రం వేయగలిగినంతగా ఎదిగాడు. కంగ్రాట్స్! కాని, చిత్రకళలో బేసిక్స్ కూడా తెలిసినట్లు లేదు" అంటూ బొమ్మను తుడిచేశాడు. షరా మామూలుగా దుష్ట చతుష్టయం బయటకు వెళ్లిపోయింది.

మర్నాడు బోర్డుమీద బొమ్మలేవీ లేవు...

కాని, పాఠం చెపుతున్నంతసేపూ పిల్లి కూతలూ, కుక్క అరుపులూ మొదలెట్టారు. మధ్యమధ్యలో 'తారుడబ్బా' అని అరవడం, అటు తిరిగితే బుద్ధిమంతులుగా తలలు దించుకు కూర్చోవడం సాగించారు.

పాఠంలో ఒకచోట 'కారు మబ్బులు' అని వచ్చింది.

"సార్... అక్కడ అచ్చుతప్పు పడినట్లుంది!" అన్నాడు ముర్రె.

ప్రశ్నార్థకంగా చూశాడు ప్రకాశరావు.

మిగిలిన ముగ్గురు "టాక్సీ మబ్బులు ఉండగా అక్కడ ఉండాల్సింది కారుమబ్బులు కాదు. 'తారు మబ్బులు' అనుకుంటాను... ఏమంటారు?" మందంగా నవ్వారు.

ప్రకాశరావు నల్లని ముఖం ఎఱ్ఱబడింది.

"మొద్దుచర్మంతో నల్లగా నిగనిగలాడే దున్నపోతుల్ని కూడా 'కారుదున్న, కర్రిదున్న' అంటారు. ఆ విషయం నీకు బాగా తెలుసుండాలి!" అన్నాడు ప్రకాశరావు నిబ్బరంగా.

ఈసారి దుష్ట చతుష్టయం తప్ప క్లాసంతా పగలబడి నవ్వింది. రుసరుసలాడుతూ ఆ నలుగురూ బయటకు పోయారు.

ఆ రాత్రి ఇద్దరు విద్యార్థులు ప్రకాశరావు ఇంటికి వచ్చారు.

"సార్... ఆ నలుగురూ మీమీద కక్షగట్టారు సార్! అదను చూసి మీమీద దాడి చేయాలని చూస్తున్నారు సార్... మీరు జాగ్రత్తగా ఉండాలి సార్!" అన్నాడు ఒక విద్యార్థి.

"పోనీ, సెలవులో వెళ్లిపోండి సార్!" అన్నాడు ఇంకొకడు.

"ఎన్నాళ్లు పోతాం? ఎన్ని రోజులు తప్పించుకు తిరుగుతాం?" అన్నాడు ప్రకాశరావు.

"వాళ్ళు వట్టి గూండా వెధవలు సార్!" అన్నాడు ఒక విద్యార్థి.

"సరే... ఆలోచించి నిర్ణయం తీసుకుంటాను. నా జాగ్రత్తలో నేనుంటాను!" అని వాళ్ళని పంపించేశాడు ప్రకాశరావు.

మర్నాడు మామూలుగా క్లాసుకు వెళ్లాడు ప్రకాశరావు.

'తారు డబ్బా' అన్న పేరుతో ఏదో విధంగా నానాటికీ వేధింపు ఎక్కువ కాసాగింది.

ఇంక ఓర్పు కోల్పోయే పరిస్థితి వచ్చింది.

ఆరోజు ప్రిన్సిపాల్‌ని కలుసుకుని తాము ఎదుర్కొంటున్న సమస్యని సవివరంగా చెప్పి తాను రాజీనామా చేయదలచుకున్నట్లు చెప్పాడు ప్రకాశరావు.

"చూడండి... కాలేజీల్లో ఇవన్నీ మామూలే! నాకు మొదట్లో పొట్ట ఎత్తుగా ఉండేది. అందుకని నాకు 'చూడు తాంబేలు' అని పేరు పెట్టి ఏడిపించేవారు. బోర్డు మీదా రాసేవారు. వెనకాల అరిచేవారు. వాళ్ళకోసం కాకపోయినా, నా ఆరోగ్యం కోసం పొట్ట తగ్గించు కున్నాను. అప్పుడు ఏం చేశారో తెలుసా? 'ఈనిన తాంబేలు' అని పేరు మార్చారు. ఆ కాలేజీలో ఉన్నంతకాలం నాకు ఆ పేరు మారలేదు"

– అన్నాడు ఆయన నవ్వుతూ.

"కాని, వీళ్ళ వేధింపులు ఒకరకంగా లేదు. రోజూ ఏదో రకంగా ఉంటుంది. నేను రిపోర్టు ఇస్తుంటే వాళ్ళ కక్ష పెరిగిపోతోంది. పైగా, వాళ్ళు నామీద దాడి చేయాలని

కూడా అనకుంటున్నట్లు తెలుస్తోంది. ఆ నలుగురూ పోతేనే పరిస్థితి బాగుపడ్తుంది. లేకుంటే మిగిలిన విద్యార్థులు కూడా చెడిపోతారు."

"ఆ మాట నిజమే! అదే వేరే విద్యార్థులైతే నిమిషంలో డిబార్ చేసి ఉండేవాడిని. కాని, ఆ నలుగురూ బాగా రాజకీయ పలుకుబడి ఉన్నవారు. వాళ్ళమీద ఈగ వాలినా నా ఉద్యోగం ఉండదు. ఈ విషయంలో నేనేమీ చేయలేను. ఒకవేళ నేను ధైర్యం చేసి వాళ్ళ మీద చర్య తీసుకున్నా ఆ కక్షతో మీకు, నాకూ కూడా అపకారం చేస్తారు."

"అయితే... నాకు రాజీనామా చేసి వెళ్లిపోవడం ఒకటే మార్గం!" అన్నాడు ప్రకాశరావు.

"ఆ మాట నిజమే! కాని, ఒక్క విషయం చెప్పదలచుకున్నాను. మీరు ఎడ్యుకేషన్ లైను విడిచి వేరే ఉద్యోగంలో చేరితే ఫర్వాలేదు. కాని, ఇదే లైన్‌లో ఉంటే ఏ కాలేజీలోనైనా మీకీ బాధలు తప్పవు. అయితే ఒక్కటి... నీడని చూసి భయపడి పారిపోతే అది మనల్ని వెంటబడి తరుముతుంది. ఆ నీడకి ఎదురుతిరిగితే అది మననుంచి దూరంగా పారిపోతుంది. బాగా ఆలోచించి నిర్ణయం తీసుకోండి. ఈ వయసులో మీకు వేరే గవర్నమెంట్ ఉద్యోగం దొరకదు!" అన్నాడు ప్రిన్సిపాల్.

ఆ రాత్రి ప్రకాశరావు బాగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాడు.

మర్నాడు బాగా ముందుగానే క్లాస్‌రూమ్‌కి వెళ్లి బ్లాక్‌బోర్డ్ మీద ఇలా రాశాడు...

"డియర్ స్టూడెంట్స్! మనిషి అందంగా ఉండడం కాని, వికారంగా ఉండడం కానీ అతని చేతిలో లేదు. అంతా దైవ నిర్ణయం! నేను నల్లగా 'తారు డబ్బా' లాగా ఉంటానని నాకు తెలుసు. కాని, దానికి నేనేమీ చేయలేను. అయితే నా రూపం మీలో కొందరికైనా వినోదం కల్పిస్తున్నందుకు సంతోషం! అందుచేత మీకు వినోదం కల్పిస్తున్న ఈ 'తారు డబ్బా' అన్న పేరుని నా పేరు బదులు ఉంచుకోదలుచుకున్నాను. అఫీషియల్‌గా పేరు మార్చుకునే ప్రయత్నం చేస్తాను. మీరు నిరభ్యంతరంగా నన్ను ఆ పేరుతో పిలవవచ్చు. మనిషిగా పుట్టినందుకు ఆ జీవితానికి కొంతైనా సార్థకత ఉండాలి. మీకు వినోదం కల్పించడం వల్ల నా జీవితానికి సార్థకత వస్తుందనుకుంటాను. ఒక లెక్చరర్‌గా మీ అభిమానాన్ని పొందలేకపోయినా, ఈ విధంగా మీ మనస్సును చూరగొనగలిగితే సంతోషం! ఈరోజు నేను సెలవు పెట్టి వెళ్లిపోతున్నాను. మీ నిర్ణయం ఏమిటో రేపు నేను వచ్చేసరికి బోర్డు మీద రాయండి. దాని ప్రకారం నడుచుకుంటాను. వద్దనుకుంటే రాజీనామా చేసి వెళ్లిపోతాను."

మర్నాడు గంభీర వదనంతో క్లాసులోకి వచ్చాడు ప్రకాశరావు. నల్లబల్ల మీద ప్రకాశరావు బొమ్మ వుంది. కాని, వికారంగా వేసి లేదు. దాని క్రింద 'తారు డబ్బా' అని లేదు. 'కె.పి.ఆర్.' అని ఉంది.

బొమ్మ ప్రక్కన "మాస్టారూ! మీరే మా లెక్చరర్‌గా ఉండాలి. ఇంకెప్పుడూ మీ మనసుకి కష్టం కలిగేలా ప్రవర్తించం. మమ్మల్ని క్షమించండి!" అని రాసి వుంది. వాళ్ళలో ఏ మూలనో వున్న మానవత్వం మేలుకొంది.

ప్రకాశరావు కళ్ళు ఆనందంతో ప్రకాశించాయి. దుష్ట చతుష్టయం వైపు చూశాడు. వాళ్ళు ఒక్కసారి ఆయన వంక చూసి, తల దించుకున్నారు. ఆరోజు వాళ్ళు సెల్‌ఫోన్, హెడ్‌ఫోన్‌లు తేలేదు. మౌనంగా కూర్చున్నారు.

ప్రకాశరావు వాళ్ళవంక చిరునవ్వుతో చూసి, బ్లాక్‌బోర్డ్ మీద "థాంక్స్!" అని రాసి తర్వాత మొత్తం బోర్డు తుడిచేశాడు.

ఆ తర్వాత పాఠం ప్రారంభించాడు. ఆ రోజున ఎప్పుడూ లేనంత నిశ్శబ్దంగా పాఠం విన్నారు విద్యార్థులు.

నిజమే... నీడకి ఎదురుతిరిగితే అది పారిపోతుంది.

*'ఆంధ్రప్రభ' వారపత్రిక . . . 14 జులై, 2001*

అమ్మకానికి అందుబాటులో ఉన్న
కె.ఆర్.కె. మోహన్ ఇతర రచనలకై ఈ పుస్తకం చివరి పేజీల్లో చూడండి...